
Swarga SeeMa.



ఇంటర్నేషనల్
ఫిలిమ్స్ లిమిటెడ్
వారి ద్వారా
విడుదల।

VENKATRAMANJAM CHETTY
PIECE-GOODS MERCHANTS
MADRAS

వాహినీ వారి

# స్వర్గసీమ

డైరెక్టర్.... బి. యన్. రెడ్డి

# నిర్మాతలు...నటీనటులు

కథ

యస్. వి. రాఘవాచార్య

సంగీత దర్శకులు
చిత్తూరు వి. నాగయ్య
ఓగిరాల రామచంద్రరావు

నృత్య దర్శకుడు
వేదాంతం రాఘవయ్య

సహకార చిత్రదర్శకుడు
కే. కామేశ్వరరావు

నిర్మాణ కార్యదర్శి
యం. లింగమూర్తి

ప్రకటనశాఖ చిత్రకారుడు
కే. నాగేశ్వరరావు

ఫోటోగ్రఫీ
మార్కస్ బార్ట్లే

సౌండ్ రికార్డింగ్
దిన్షా తెహరానీ
టి. టి. అరుసు

ఆర్ట్ డైరెక్షన్
యఫ్. నాగూర్

మేకప్
హరిబాబు

ఎడిటింగ్
నారాయన్ & జంబులింగం

లేబొరేటరి
హరికృష్ణ & యతిరాజు

నిర్మాణము
న్యూటోన్ స్టూడియోస్

## స్క్రీన్ ప్లే & డైరెక్షన్ : బి. యన్. రెడ్డి

చిత్తూరు వి. నాగయ్య —మూర్తి
శ్రీమతి జయమ్మ —కళ్యాణి
శ్రీమతి భానుమతి —సుజాత
ఏ. హెచ్. నారాయణరావు —నరీన్
యం. లింగమూర్తి —గంగన్న
బి. శివరావు —శ్రీనివాస్
డాక్టర్ జి. సీతాపతి —రామకృష్ణరావు
యస్. రంగస్వామి —రాఘవయ్య
కె. దొరస్వామి —డాక్టర్

నాగేశ్వరరావు .... తదితరులు.

ఈ చిత్రంలోవచ్చు పాత్రలూ, ఘటనలూ, కల్పితాలు, ఏ వ్యక్తినీ ఉద్దేశించినవి కావని మనవి.



# స్వర్గసీమ

## కథా సంగ్రహము

"ఇలలోనలేదంచు తలపోయనేలా కలలందు దర్శింపగా కోరనేలా
జపమేల తపమేల వ్రతపూజలేలా....మీ గృహమేకదా స్వర్గసీమా."

మూర్తిగారు పట్నంలో నాట్యభారతి పత్రిక సంపాదకులు. కల్యాణి ఆయనభార్య. పాప, ప్రభు వారిపిల్లలు. సెలవుమీద మూర్తిగారు భార్యాబిడ్డలతో తన మామగారి వూరికి వెళ్ళారు. మూర్తిమామగారికి కల్యాణి ఒక్కతే కూతురు. తల్లి చిన్నతనంలోనే పోవడం వల్ల తండ్రి రాఘవయ్య కల్యాణిని ఎంతో గారాబంగా పెంచాడు. ఆ వూళ్లో ఒక పేరువడిన వీధి భాగవతుల మేళం రుక్మాంగద చరిత్ర ఆడుతున్నారు. ఆమేళానికి పెద్ద ఆటగంగడు. గంగడి కూతురు సుబ్బే మోహినీవేషం కట్టింది. సుబ్బి ఖదంతొక్కుతూ పదం పాడుతూ ఆబాలగోపాలన్ని సమ్మోహింప చేసింది. మూర్తీ, కల్యాణీ చాలా పొద్దుపోయేవరకూ భాగవతంచూసి ఆనందించారు.

మరుసటిదినం ఆటగంగడూ, కూతురు సుబ్బీ, పాతకోటుకీ, పాతచీరకూ తయారయ్యారు. వాళ్ళనుకాదని తప్పించుకోవడం కష్టం. కోటిస్తూ, మూర్తిగారు గంగన్నతో, సుబ్బిని ఏనాటక కంపెనీలోనైనా ప్రవేశపెడితే చాలా పైకొస్తుం దని సలహాయిచ్చాడు. ఆ సహాయంచేస్తే మూర్తిగారికి తన చర్మంతో చెప్పులు కుట్టిస్తా నన్నాడు గంగడు. తానెరిగిన నాటక కంపెనీకి సిఫారసు వుత్తరం యిచ్చి మూర్తిగారు పట్నం వెళ్ళారు.

కాకాపట్టి కార్యం సాధించుకోవడం గంగన్నకూ సుబ్బికీ వెన్నతో పెట్టిన విద్య. చూడవలసినవారిని చూశాడు; చేయవలసినవన్నీ చేశాడు; అనుకున్నట్టుగా అన్నీ జరిగితే ఒకరోజున సుబ్బిచేత రాజ్యాలేలించా లని గంగడి ఆశ. నాటకాల్లో సుబ్బిని మెచ్చుకోనివారు లేరు. సుబ్బి సుబ్బులై, సుబ్బలక్ష్మియై, సుజాతగామారి, సొంత కంపెనీ స్థాపించి, దేశం తిరుగుతూ చెన్నపట్నం చేరింది.

మద్రాసు చేరిన తర్వాత మూర్తి తన సంసారమేమో, తన పత్రికేమో తప్ప ఆ సుబ్బి మాటే మరిచిపోయాడు. లక్ష్మినివాస్ నాట్యమండలి 'మేనక' ప్రదర్శనంలో మేనక పాత్ర

ధరించిన సుజాత ఆసుబ్బులేనని తెలుసుకొని, మూర్తీ కల్యాణీ ఎంతో సంతోషించారు. మరునాడే పూలదండలూ, పండ్లూ చేతబుచ్చుకొని సుజాత మూర్తిగారివాకిట్లో ప్రత్యక్షమైంది. వద్దన్నా వినకుండా సుజాత దంపతులిద్దరినీ పుష్పమాలాంకృతుల్నిచేసి తన కృతజ్ఞత వెలిబుచ్చింది. తాను చిన్నప్పట్నుంచీ యెరిగున్న సుబ్బి అభ్యుదయానికి కల్యాణి యెంతో సంతోషించింది. అదేసాకుగా, సుజాత కల్యాణిసహాయంతో, మూర్తిగారు ఒక నాటకం వ్రాసి ఇచ్చేటట్టుగా, మాట తీసుకుంది. ఆ నాటకంతో తన భర్తకు అఖండ కీర్తి కలుగుతుందని కల్యాణి ఉప్పొంగిపోయింది.

మూర్తి దినచర్యలో నెలలు గడిచాయి గాని, సుజాతకు మాటయిచ్చిన నాటకంమాత్రం సాగలేదు. ఈ ఆలస్యం సుజాత గుర్తించి మూర్తిని తనవానిగా చేయ సంకల్పించింది. మామూలుప్రకారం మూర్తి సుజాత ఇంట్లో నాటకం వ్రాస్తున్నాడు. సుజాత పావురాయి చేతబట్టుకుని గదిలో ప్రవేశించింది. మూర్తి మనస్సును కలవరపెట్టటానికి ఆడింది, పాడింది, అన్యాపదేశంగా మాట్లాడింది. నాటకం వ్రాస్తున్న మూర్తికి తారావిధేయుడైన చంద్రుడూ, ఏకపత్నీవ్రతుడైన శ్రీరాముడూ ఒక్కమారే జ్ఞాపకానికొచ్చారు. కలవరపడ్డాడు. తుదకు ఆదర్శాన్ని పశువాంఛే జయించింది.

రోజులు గడిచాయి. మూర్తికిప్పుడు భార్యాపిల్లలతో మాటాడడానికి వ్యవధిగాని, మనస్సుగాని వుండడంలేదు. అతనికిప్పుడు సుజాతే సర్వస్వం. అతని శ్రేయోభిలాషీ, నాట్యభారతి యజమానీ అయిన రామకృష్ణరావు మూర్తిని సన్మార్గంలోకి త్రిప్పడానికి యెంతోదూరం ప్రయత్నించాడు. మూర్తి సంపాదకత్వానికి రాజీనామా పెట్టి తాను వ్రాసిన ఋష్యశృంగ నాటకంలో తానే నాయకపాత్ర ధరించడానికి అంగీకరించాడు. కల్యాణి జీవితనాటకాన్ని భగ్నంచేసినా మూర్తి ఋష్యశృంగనాటకాన్ని జయప్రదంగా ముగించాడు. సుజాత కంపెనీ మద్రాసునుంచి మకాం మారుస్తూవుంది. మూర్తి రైలుకుపోతూ ఒకసారి ఇంటికి వెళ్ళాడు. "తొందరలో తిరిగివస్తాను, అందాకా యీ సొమ్ముంచుకో" అంటూ కల్యాణికి కొంతపైకం యిచ్చి, సుజాతవెంట దేశసంచారం బయలుదేరాడు.

నెలలు గడిచాయి. సంవత్సరంకూడా నిండింది. మూర్తినుంచి కల్యాణికి జాబుగానీ కబురుగానీలేదు. తా నెన్నిజాబులువ్రాసినా బదులులేదు. తనదుస్థితికి తనలో తాను దుఃఖిస్తూ వుండగా, తలవనితలంపుగా ఆమెతండ్రి రాఘవయ్య వచ్చాడు. "అమ్మాయీ, నీమొగుడు నిన్నూ పిల్లల్నీ వదిలేసి, యెవతెతోనో వెళ్ళాడని విన్నాను. నిజమేనా" అని అడిగాడు. తెచ్చుకున్న నవ్వుతో, "నాభర్త కీర్తీ, సంపాదనా చూచి ఓర్వలేక, లోకం అలాంటి వదంతులు పుట్టిస్తుంది. నిన్ననే వుత్తరంకూడా వ్రాశారు. నన్ను పిల్లలతో బెంగుళూరికి వచ్చెయ్యమని. నీకీ సంగతి వ్రాద్దామనుకున్నాను. నీవే వచ్చేశావు." అంది కల్యాణి.

భర్త కళంకాన్ని కప్పిపుచ్చడానికాడిన అబద్ధంకోసం విధిలేక ఆమె బెంగుళూరు పోవలసి వచ్చింది. మూర్తి ప్రపంచాన్నే మరిచి సుజాతతో హాయిగా బెంగుళూరులో సుఖస్వప్నాలు కంటున్నాడు. కల్యాణి తన రాక దాసీద్వారా తెలిపింది. కల్యాణీ పిల్లలూ అప్పటిలో అక్కడ కనిపిస్తారని స్వప్నంలోకూడా తలపోయని మూర్తి వారిని చూడగానే నిర్జీవప్రతిమలా నిలబడిపోయాడు. తండ్రి నిరాదరణచూచి పిల్లలు ఖిన్నులయ్యారు. "వీళ్ళనైనా దగ్గరకు తీస్తా రనుకున్నాను. ఈరోజుతో ఆ ఆశకూడా పోయిం"దంటూ కల్యాణి వచ్చిన బండిలోనే తిరిగి వెళ్ళిపోయింది.

భర్తృ పరిత్యక్తను సంఘం గౌరవించదు. తన విషాదజీవితంతో వృద్ధుడైన తండ్రిజీవితం దుఃఖభాజనంచేయటం ఆమె కిష్టంలేదు. అజ్ఞాతవాసమైనాసరే, తన్నెవరూ యెరుగనిచోట పిల్లలకోసం జీవించాలని ఆమె నిశ్చయించుకుంది.

సుజాతకు మూర్తిమీద మోజుతగ్గింది. సంఘాన్నీ, కళనూ మరమ్మతుచెయ్యాలని, 'నరీన్' అనే ఒక అందమైనయువకుడు సుజాతకూ, గంగన్నకూ తారసిల్లాడు. వారిదృష్టిలో అన్నింటనూ మూర్తికంటే నరీనే మెరుగనిపించాడు. మూర్తికి స్వస్తిచెప్పాలనే రోజులు సమీపించాయి. ఒకనాటిరాత్రి నాటకం జరుగుతుండగా తెరతాడు తెగి మూర్తినెత్తిన పడ్డది. అదృష్టవశాత్తూ చావుతప్పి ఆసుపత్రిలో పడ్డాడు. కొన్నిమాసాలవరకూ అతను మామూలు మనిషి కాలేకపోయాడు. ఆస్పత్రిలోవుండగా ఒకరోజున సుజాతకంపెనీ నరీన్‌తో "గాజుల పిల్ల"అనే నాటకం ప్రదర్శిస్తున్నటు చూచాడు. ఆరోజే నాటకం. సుజాతకు టెలిఫోన్ చేశాడు, కారు పంపించమని. "మీరు రానక్కర్లేదు. మీరు లేకుండానే నాటకం జరుగుతుంది" అంటూ సమాధానం వచ్చింది. తను లేకుండా నాటకం ఎలా జరుగుతుందో చూదామని మూర్తి థియేటరుకు వెళ్ళాడు. ప్రేక్షకులు బ్రహ్మానందంతో నాటకం చూస్తున్నారు. తన సుజాత నరీన్‌తో కలిసి విరగబడి నృత్యం చేస్తూవుంది. ఒక్కమారు సుజాతనేంచేయాలో తెలియలేనంతకోపం వచ్చింది మూర్తికి. ఆపరిస్థితుల్లో అతనేమిచెయ్యగలడు? అతడు చెయ్యగల్గిందల్లా కల్యాణిని క్షమాభిక్ష కోరడమే. కాని అజ్ఞాతవాసం చేస్తున్న కల్యాణి జాడ అతనికెలా తెలుస్తుంది?

మూర్తీ కల్యాణీ కలిసి బెంగుళూరులో సుఖంగా ఉంటున్నారనుకున్న మూర్తి మామగారికీ రామకృష్ణయ్యగారికీ మూర్తిని చూడగానే యదార్థం తెలిసింది. తనగౌరవం కాపాడటానికి భార్యచేసిన త్యాగం మూర్తిని మరింత క్రుంగతీసింది. తనముఖం వారికి చూపించలేక పోయాడు. భార్యాబిడ్డలను వెదకడమే జీవితపరమావధిగా పెట్టుకుని అన్వేషణకు బయలుదేరాడు. ఎన్నిచోట్ల తిరిగినా అతని మనోవాంఛ సిద్ధించలేదు. ఇంతలో ఒకఅబ్బి టెంకాయ పిడేళ్ళు బడిపిల్లలకు అమ్మడంచూశాడు. మూర్తి కొక ఆలోచన

తట్టింది. తనుమాత్రం ఆపని యెందుకు చెయ్యకూడదు ? ఇంతకంటే పిల్లల్ని కనుక్కోటానికి మంచి సాధన మేముంది? మూర్తి ఠెంకాయఫిడేలు తీసుకున్నాడు. వాయించుకుంటూ వూళ్ళూ నాళ్ళూ తిరగసాగాడు.

"ఏయ్, ఫిడేలబ్బీ!" అనే పిలుపు! ఎవరిదా పిలుపు—తిరిగిచూశాడు. పాప....తన పాప! —మాసినజుట్టుతో, పెరిగినగడ్డంతో, చిరిగినబట్టలతో, జీర్ణించిపోయిన తండ్రిని పాప గుర్తించలేదు. బేరమాడి ఫిడేలుకొన్నది. పాపముందు తనకన్నీరు ఆపుకోలేక మూర్తి చరచరా వెళ్ళిపోయాడు. తన అన్యాయానికి బలియై దరిద్రాన్ని లెఖ్ఖచెయ్యక తన పిల్లల్నిపెంచి పెద్దచేస్తున్న తనభార్యఔదార్యం తలచుకొన్నకొద్దీ అతని కా ఇంట్లో అడుగుపెట్టే అర్హత లేదనిపించింది. ఇంత ప్రయాసపడి భార్యాపిల్లల ఉనికి తెలుసుకుని కలుసుకోకుండా పోవటమా ? ఏమైనాసరే, కడసారి అందర్నీ చూడాలనుకున్నాడు. ఈనిర్ధారణకు వచ్చేవరకు అర్ధరాత్రి దాటింది.

ఠెంకాయ ఫిడేలుమీద అబ్బి పాడుతూఉండగా విన్న స్వర్గసీమ పాటలోని ఒక చరణం పాప పాడుకొంటున్నది. బట్టలు కుట్టుతూవున్న కల్యాణికి పాపపాడే చరణం తన హృదయంలోదాచిన అమూల్య ఆభరణాన్ని బయటికిలాగుతున్నట్టు అనిపించింది. "పాపా, నీ కీ పా టెవరు నేర్పారమ్మా?" అని అడిగింది. "వాడే, ఆఫిడేలబ్బి" అని పాప సమాధానం ఇచ్చింది. కల్యాణి హృదయంలో తుపాను బయలుదేరింది. ఎలాగో తన దుఃఖం పాపకు తెలియకుండా ఆపుకుంది. పాప నిద్రపోగానే పసిపిల్లవలె ఏడ్చిఏడ్చి|కుట్టుమిషనుమీ దే సొమ్మసిల్లింది. ఏదో గిన్నెచప్పుడులో అదిరిపడిలేచింది. ఎవరో ఇల్లుదోచుకుని పరుగెత్తున్నట్టు కనిపించింది. 'దొంగ దొంగ!' అంటూ లేచి వెంటపడ్డది. పరిగెత్తే వ్యక్తి నిలబడ్డాడు.

"ఏమి దోచుకుపోతున్నా" వని కల్యాణి అడిగింది. "ఉన్నదంతా ఇదివరకే దోచుకున్నా" నని సమాధానం. ఎవరి దీ కంఠధ్వని ? వారిదేనా ? ఒక్కపరుగులో లాంతరుతెచ్చి ముఖం పరకాయించిచూచింది. ఇంకెవరూ ? వారే ? తనభర్త మూర్తే! మూర్తి సిగ్గుతో తల వంచుకున్నాడు. స్వామీఅంటూ కల్యాణి మూర్తికాళ్లమీద వ్రాలింది.

* * * *

మళ్ళీ కల్యాణీ మూర్తుల జీవితంలో నూతనాధ్యాయం ప్రారంభమైంది.

కోల్పోయిన స్వర్గసీమను తిరిగీ వారు నెలకొల్పుకున్నారు.






### వీధినాటకం : మోహినీ రుక్మాంగద [దరువు]

ముద్దుకుమారుల ముద్దరాలి నే ప్రొద్దుచూడ రాదోయీ,
నాయొద్ద నుండవలెనోయీ.
ఒద్దికతో నా సుద్దులు నడుపుచు హద్దుమీర రాదోయీ,
నాయొద్ద నుండవలెనోయీ.

### రుక్మాంగదుడు [కందార్థం]

రాణివిగాదే కొమ్మా,
ప్రాణంబులనైన విడతు బంగరుబొమ్మా:
పాణిని వడిగైకొమ్మా,
రాణినిచేయుదును, వేగిరమ్మున రమ్మా. బిగి కౌగిలినిమ్మా.

### రుక్మాంగదుడు

నీకౌగిటిలో నిలువగజాలిన నాకమేలనే భామా, సురలోకమేలనే భామా
లోకేశులకును దొరకని వలపులు నీకొసంగనారాజా నే నీకొసంగనా రాజా!

### కల్యాణి [మేలుకొలుపు]

మేలుకో కృష్ణా, నిదుర మేలుకో స్వామీ!
పాలుమాలికలు చాలునురా, కృష్ణా! ॥మేలు॥
గల గల గల చిరుగంటలతో ఝుళంఝుళంఝుళ మువ్వలరవళితో
ఆలమందతో గోపాలకులు బృందావనికి వెడలినారురా ॥మేలు॥
మేనుమరచి నిదురించేవారిని మేలుకొలుపగల రెవరైనా
కనులుమూసికొని నిదురనటించే ఘనుల లేపగా నాతరమా!

## మూర్తి

నాతరమా, నిదురనాపగా నాతరమా!
మధురవిపంచీరవ మేళముతో మధుర మధురగళ మాధుర్యముతో
మధురమూర్తి ప్రియ భామిని మధువు లూరగా ఆలపించగా
మదికదలించే ఆగానము విని నిదురనాపగా నాతరమా!
ఆపకేపాటా నిదుర లేపకే రాధా!

## సుబ్బులక్ష్మి [జావళి]

మంచిదినము నేడు మహరాజుగా రమ్మనవే,
పొంచిచూచు ఛేలనే, పొలతి మువ్వగోపాలుడు.
మదతిరో అలవాని సొమ్మేగదటవే ఈ మేను
వదరితే యేమౌనో పడుచుదనమందురే.
వదయుని విడనాడుట సహజమౌనటె చెలియా,
కొదువవద్దనవె ఆకొమ్మ పేరెత్తననవె॥మంచి॥

## ● కల్యాణి [పాట]

గృహమేకదా స్వర్గసీమా!
మహనీయమౌ ప్రేమ మహిమమ్ము వెలసిన
ఈగృహమేకదా - మనగృహమేకదా స్వర్గసీమ!
ఇలలోనలేదంచు తలపోయనేలా, కలలందు దర్శింపగా కోరనేలా,
జపమేల తపమేల వ్రతపూజలేలా, సాధించితే ప్రేమ సామ్రాజ్యమౌనీదు.
జగతిని యశమంది సంపదలంది, ప్రియమునలాలించి పాలించువిభుడు,

## మూర్తి

చిరునవ్వువెన్నెల్లు చిందేటి మోముతో జీవితమునదారి చూపించు చెలువ,
చిన్నారి పొన్నారి చిట్టిపాపలగోము చెల్లించు దాంపత్య శోభనుపెలసిన. ॥గృ॥

## ● సుజాత [గీతిక]

ఓ హో హో పావురమా! వెరపేలే పావురమా! పావురమా!
తరుణయౌవనము పొంగిపొరలు నా వలపు కౌగిలిని ఓలలాడ రావే ॥ఓ॥
తనకుతానై వలచి పిలిచే తన్విమోహమని చుల్కన సేయకుమా ॥ఓ॥

## ● మూర్తి [నృత్య గీతిక]

హాయిసఖీ! హాయిసఖీ! బ్రతుకే హాయి సఖీ!
హాయిగొల్పు ఈరేయీ మధురస్వప్న మోయీ.
వెన్నెలప్రోవుల క్రొన్ననతావుల వలపులవలలో నీ చేదోయీ;
తళ తళ కని మెరపు తీవెలై విరిసె నీదు కనుదోయీ;
ఝులఝులఝుల ప్రణయమధువులే కురిసె నాదు మదినోయీ.

## కల్యాణి [ప్రార్థన]

రారా రాధామనోరమణా, రమణీయ గుణాభరణా ॥రారా॥
తెన్నులుచూచీ నీ కొరకై నాకన్నులు కాయలు కాచెనురా,
కన్నడసేయుట కూడదురా, ఆ పన్ననురా, నమ్మితిరా ॥రారా॥
నీవు వినా ఈ దీనకు గతి వే రెవరు లేరురా జీవాధారా
నీవేయిక యేనాటికినై నను కావగవలెరా, రావలెరా ॥రారా॥

## కల్యాణి [జోలపాట]

జో అచ్యుతానంద జోజో ముకుందా, లాలి పరమానంద లాలిగోవింద॥జో॥
తొలుత బ్రహ్మాండమ్ము తొట్టిగావించి నాలుగువేదాల గొలుసులమరించి
బలువైన ఫణిరాజు పానుపమరించి చెలులు డోలిక నిన్ను చేర్చిలాలింప॥జో॥

## ● రేడియో [భావగీతం]

ఎవని రాకకై యెదురు చూచెదో ఏకాకినివౌ బేలా!
వెన్నెలరాత్రులు గడచిపోయినవి ఎన్నాళ్ళో చీకటులూ
వలపులుచిలికే బాహువల్లరిని విశ్రమింపగా విభుడిక రాడే!

## ● ఋష్యశృంగలో మాయాదేవి [బోటు పాట]

ఓహో! తపోధనా! సుందరా, యౌవన మదభర మధుకరా!

రావేలా రావేలా, మా ప్రణయ నౌకలో నవజీవనకేళినిదేలా

రావేలా రావేలా! (కోరస్)

మందరవనిలో కొసరికొసరి నిను కుహూకుహూకుహూమని కోయిలపిలువా

రావేలా రావేలా! (కోరస్)

భువనైక నవమోహనా! కనరాని స్వర్గమునకై కనుమూసి తపమేలనోయి,

భువనైక నవమోహనా॥

రావేలా రావేలా! (కోరస్)

ఉదయారుణ శోభలలో కనరాని తీయకలలూ, కనవా! రావా! ॥ఓహో॥

## సుజాత & నరేష్ [నృత్యగీతిక]

ఓ ఓ నారాజ! ఓహో నారాజ! రావో మారాజ! ఓహో నారాజ!

అరే హా, లేవెన్నెల చిరునవ్వుల విరజిమ్ము పఠాణీ

నీ రాకగోరి నీ దారి కాచియున్నానే, నీకై వేచియున్నానే, పిల్లా కల్సుకున్నానే!

చాలులె పోరా మాయలమారీ, ఈదారీ నీజాడ కనగోరి వెతకి వేసారి,బేజారై తిరా॥

ఓ నా సిట్టిసిలకా ఎంతలసిపోతివే అయ్యో!

ఒయ్యారిబావ వగలిక చాలుగాని పోరా!

నా రాణీ!

నా రాజా!

పాడుకుందామా జతగా ఆడుకుందామా!